
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

సోమవారం 11 నవంబరు 2024 | www.prajaaswaramdaily.com | 2 pm


# ఆర్జీయూకేటీలో విద్యార్థిని సూసైడ్




## నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో ఘటన

నిర్మల్: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ లో జరిగింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన సాయి ప్రియ పీయూసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఇద్దరు స్నేహితులతో కలసి క్యాంపస్ వసతి గృహంలోనే ఉంటుంది. సోమవారం ఉదయం తన ఇద్దరు స్నేహితురాళ్లు అల్పాహారం కోసం వెళ్లగా.. గదిలో సాయి ప్రియ మాత్రమే ఉంది. వారు తిరిగి వచ్చే చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి చేతిలో ఓ సూసైడ్ నోట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్జీయూకేటీకి ఇటీవల నూతన ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ నియామకం తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం తొలిసారి. పోలీసులు మరిన్ని వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

# ఏపీ బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లు

### బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ. 2,35,916.99 కోట్లు

### మూలధన వ్యయం రూ. 32,712.84 కోట్లు

### రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టిన మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,94,427.25 కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొచ్చారు. బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం అంచనా రూ. 2,35,916.99 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ. 32,712.84 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ. 34,743.38 కోట్లు, ద్రవ్య లోటు రూ. 68,742.65 కోట్లుగా పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగం ద్వారా వెల్లడించారు. బడ్జెట్‌లో వివిధ కీలక రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కృషి చేస్తామని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకానికి నిధులు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 1-12వ తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**శాఖల వారీగా కేటాయింపులు ఇవీ..**

పాఠశాల విద్య - రూ.29,909 కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలు - రూ.11,855 కోట్లు, ఎస్సీ సంక్షేమం - రూ.18,497 కోట్లు, ఎస్టీ సంక్షేమం - రూ.7,557 కోట్లు,

బీసీ సంక్షేమం - రూ.39,007కోట్లు, మైనార్టీల సంక్షేమం - రూ.4,376 కోట్లు, మహిళా శిశు సంక్షేమం - రూ.4,285 కోట్లు,

మానవ వనరుల అభివృద్ధి - రూ.1,215 కోట్లు, ఉన్నత విద్య - రూ.2,326 కోట్లు, ఆరోగ్య రంగం - రూ.18,421 కోట్లు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధికి - రూ.16,739 కోట్లు, పట్టణాభివృద్ధి - రూ.11490 కోట్లు, గృహ నిర్మాణం - రూ.4,012 కోట్లు, జలవనరులు - రూ.16,705 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యం - రూ.3,127 కోట్లు, ఇంధన రంగం - రూ.8,207 కోట్లు, రవాణా, రోడ్లు, భవనాలు - రూ.9,554 కోట్లు, యువజన, పర్యాటక, సాంస్కృతికం - రూ.322 కోట్లు, పోలీస్ శాఖ - రూ.8,495 కోట్లు, పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ - రూ.687 కోట్లు.

## మీ ఇంట్లో నాలుగు

# ఉద్యోగాలు ఊడాయి

**తెలంగాణ సమాజానికి ఏం కాలేదు**

### కేసీఆర్ ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

### మిమ్మల్ని ప్రజలు మర్చిపోయారు

### ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో 113 మందికి నియామక పత్రాలు



**ఖైరతాబాద్ : తెలంగాణలో ఒక పెద్దాయన బయటికి వచ్చి 10 నెలల్లో తెలంగాణ ప్రజలు ఏం కోల్పోయారో వారికి తెలిసింది.. ఏం కాలేదు మీ ఇంటిలో నాలుగు ఉద్యోగాలు ఊడాయని సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. కేసీఆర్ను తెలంగాణ సమాజం మర్చిపోయిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు కూడా రావడం లేదన్నారు. ప్రతిపక్షం పాత్ర విస్మరించారన్నారు.**

తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులను పట్టించుకోలేదని సీఎం రేవంత్ అన్నారు. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో 113 మంది మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ల ఉద్యోగులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10 నెలల్లో 50 వేల నియామక పత్రాలను అందించామని ఉద్యోగులకు గర్వంగా చెబుతున్నానన్నారు. ఒక కుటుంబంలో ఉద్యోగం వస్తే అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రూప్ 1 సహా అన్ని ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఫాంహౌస్లలో పార్టీలు చేసుకునే నాయకులు మనకు ఆదర్శమా? అని అడిగారు. దీపావళి పండుగ అంటే చిచ్చుబుడ్లతో పండుగ చేసుకుంటారు.. కానీ కొందరు ఫాంహౌస్లో సారా బుడ్ల పండుగ చేసుకుంటున్నారని విమర్శించారు.

## సీజేఏగా జస్టిస్

# సంజీవ్ ఖన్నా



### 51 ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం

### వచ్చే ఏడాది మే 13 వరకు పదవీకాలం

న్యూఢిల్లీ : దేశ 51 వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ సంజీవ్ ఖన్నాతో సోమవారం ఉదయం ప్రమాణం చేయించారు. 2019 జనవరి నుంచి సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆర్టికల్ 370 సహా పలు కీలక కేసుల్లో తీర్పులిచ్చిన బెంచ్ లలో ఆయన ఉన్నారు. వచ్చే ఏడాది మే 13 వరకు ఆయన సీజేఐగా బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా, రాష్ట్రపతి భవన్ లో జరిగిన సీజేఐ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, కేంద్ర న్యాయ శాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు.

# ఢిల్లీకి కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు

### అమృత్ పథకం టెండర్ల అంశంపై కేంద్రానికి ఫిర్యాదు

### పట్టణశాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అపాయింట్ మెంట్ తీసుకున్న మాజీమంత్రి



హైదరాబాద్ : మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి బయలుదేరారు. అమృత్ పథకం టెండర్లో అవకతవకలు జరిగాయని కేంద్రానికి ఫిర్యాదు చేయనున్నారు. ఆ మేరకు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అపాయింట్ మెంట్ తీసుకున్నారు. ఎక్స్ వేదికగా కూడా ఇటీవల అమృత్ పథకం టెండర్లపై విమర్శలు గుప్పించారు.

## వికారాబాద్ జిల్లా

# లగచర్లలో ఉద్రిక్తత

### ఫార్మా కంపెనీ ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ

### కలెక్టర్, అధికారుల వాహనాలపై రాళ్ల దాడి

### పలు వాహనాలు ధ్వంసం, పోలీసుల మోహరింపు

**దుద్యాల: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఉద్రికత్త జరిగింది. ఫార్మా పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులకు రైతులు ప్రతిఘటించారు. కలెక్టర్, అధికారుల కార్లపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఫార్మా సంస్థ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ కోసం దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన రైతులతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఫార్మా సంస్థ ఏర్పాటును రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈక్రమంలో దుద్యాల శివారులో నేడు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగా నాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ వచ్చారు. దుద్యాల శివారులో ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేస్తే.. రైతులు మాత్రం అక్కడికి వెళ్లకుండా లగచర్లలోనే ఉండిపోయారు.**

ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సురేశ్ అనే వ్యక్తి బాధిత రైతుల తరఫున ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు వెళ్లి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడారు. రైతులంతా తమ ఊరిలో ఉన్నారని.. అక్కడే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని కోరారు. దీంతో కలెక్టర్, ఇతర అధికారులు అంగీకరించి అక్కడికి బయల్దేరి వెళ్లారు. అధికారులు గ్రామానికి చేరుకోగానే రైతులు ఒక్కసారిగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి రాళ్లు తగలడంతో గాయాలయ్యాయి. ఆయన పొలాల వెంబడి పరుగెత్తి అక్కడి నుంచి వెళ్లిపోయారు. జిల్లా కలెక్టర్, అధికారులు లగచర్ల వెళ్లే సమయంలో ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.





## నిలిచిన పత్తి కొనుగోళ్లు..

# ఆందోళనలో రైతులు



ఆదిలాబాద్ : రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మళ్లీ పత్తి కొనుగోలు ఆగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సంస్థ తీరుతో ప్రైవేట్ జిన్నింగ్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు కొనుగోళ్లు నిలిపేశారు. దీంతో రైతులు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

# రామ్‌గోపాల్ వర్మపై కేసు



### వ్యూహం చిత్ర ప్రచారం విషయమై సోషల్ మీడియాలో పోస్టులు

### టీడీపీ నేతల ఫిర్యాదు

ఒంగోలు : ఎప్పుడు వార్తలో నిలిచే దర్శకుడు రామ్ గోపాల్ వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీస్ స్టేషన్ లో ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. వ్యూహం సినిమా ప్రచార సమయంలో ఆర్జీవి సోషల్ మీడిమాలో పెట్టిన పోస్టుపై సోమవారం కేసు నమోదు అయింది. చంద్రబాబు, లోకేష్, బ్రాహ్మణిని కించపరిచేలా పోస్టు పెట్టారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు ఆర్జీవిపై కేసు నమోదు.